● రూ. 2,000/-ల మొదటి బహుమతి పొందిన కథ



# సహాయం

— టి.వి.కాళిదాస్

స్కూల్‌కి పంపేందుకు కొడుకుని తయారు చేస్తోంది ప్రమీల. ఎడంచేత్తో వాడి బుగ్గలు గట్టిగా తల కదిల్చేందుకు వీల్లేకుండా పట్టుకుని తల దువ్వుతూ పిలిచింది —

"వివేక్!"

"ఏంటమ్మా?" బుగ్గలు అమ్మ చేతిలో వుంటం చేత కష్టం మీద అడిగాడు.

"నువ్వా మోహన్‌వాళ్ళతో తిరక్కు బాబూ. వాళ్ళట్టి రౌడీ వెధవలు" మోహన్ వివేక్ స్కూల్లోనే కొంచెం పై క్లాసు చదువుతున్నాడు. వాడి దూకుడు స్వభావం ప్రమీలకి నచ్చలేదు.

'రౌడీల్తో తిరక్కూడదామ్మా?" అమాయకంగా అడిగాడు వివేక్ వెనక్కి తిరిగి.

"తిరక్కూడదు బాబూ. తిరిగితే నువ్వూ చెడిపోతావు. మంచి మార్కులు రావు. క్లాసులో వెనకబడి పోతావు" అంది ప్రమీల.

"మరైతే డాడీ అలా ఎందుకన్నారు మమ్మీ?" అడిగాడు వివేక్.

"ఏమని?" మోకాళ్ల మీద కూచున్నదల్లా నేల మీదికి జారుతూ అడిగింది ప్రమీల, పక్కనే పేపరు చదువుతూన్న భర్తవేపు తల తిప్పుతూ.

సుధాకర్ కూడా పేపర్ కిందికి దించేసి కొడుకు వేపు చూశాడు. వివేక్ తండ్రి వేపు తిరిగి అడిగాడు - "ఏం డాడీ, నిన్న సుషమా వాళ్ల డాడీతో మీరన్లేదూ, 'మనకే గనక రౌడీల స్నేహమో, సహాయమో వుండి వుంటే మనకీ కష్టం వచ్చేది కాదని?"

సుధాకర్ ఏం మాట్లాడలేదు. భార్య కళ్లలోకి చూశాడు. ప్రమీలకీ ఏమనాలో చప్పున తోచ లేదు.

తల్లీ తండ్రీ మౌనంగా వుండిపోయేసరికి వివేక్‌కి అనుమానం వచ్చింది, తనేదో తప్పు మాట్లాడానని.

"కానీ అమ్మా, నేను పెద్దయ్యాక పెద్ద పోలీసాఫీసరవుతాను" అన్నాడు వాడు.

ప్రమీల మొహంలో నవ్వు వెలిగింది.

"గుడ్ బాయ్" అంటూ వాడి బుగ్గ మీద ముద్దు పెట్టుకుంది.

"టాటా మమ్మీ, టాటా డాడీ"

వివేక్ వాకిట్లోకి పరుగెత్తాడు స్కూల్ వాన్ రావడంతో.

***

వివేక్ స్కూల్‌కి వెళ్ళాక ప్రమీల వంటింట్లోకి వెళ్లి పనులన్నీ ముగించుకుని వచ్చేసరికి సుధాకర్ స్నానం చేసి డ్రెస్ చేసుకుంటున్నాడు.

"నిజమా వివేక్ చెప్పింది? మీరు రమేష్ గారితో అలా అన్నారా?" అడిగింది ప్రమీల.

"అవును. నిన్న ఫ్యాక్టరీలో జరిగింది చూశాక

నాకలా అనిపించింది'' అన్నాడు సుధాకర్. అతని మొహంలో ఏదో బాధ తొణికిసలాడింది.

''ఏం జరిగింది?'' ఆదుర్దాగా అడిగింది భర్తలో కలిగిన ఈ ఆకస్మిక మార్పుకి విస్తుపోతూ.

''మా సెక్షన్‌లో వో స్పేర్ పార్ట్ పోయింది. దాని ఖరీదు పదివేల రూపాయలు. మా అందరికీ తెలుసు 'అది నారాయణ పనే' అని. కానీ, మా సెక్యూరిటీ స్టాఫ్‌కి తెలీలేదు ఎవరు తీశారో. నిజానికది తెలీకపోవడం కాదు, నారాయణ వెనకాల వున్న అండదండలకి భయపడి వాళ్లతన్ని దోషిగా నిలబెట్టలేకపోయారు. మాకూ అదే భయం. అతని వెనకాలున్న రాజకీయ గూండాల్ని ఎదుర్కొనే ధైర్యం మాలో ఎవరికీ కూడా లేదు'' చెప్తున్నాడు సుధాకర్.

''అయితే?'' అడిగింది ప్రమీల.

''అయితే ఏముంది? దొంగ దొరకలేదు కనక పోయిన వస్తువు ఖరీదు మా సెక్షన్‌లో పనిచేసే పదిమందీ, నారాయణతో సహా తలా వో వెయ్యి రూపాయలు చొప్పున ఫ్యాక్టరీకి కట్టుకోవాల్సి వచ్చింది. మా తొమ్మిది మందికీ తలో వెయ్యి నష్టం. నారాయణకి తొమ్మిది వేలు లాభం.''

ఒక్క క్షణం ఆగి మళ్లీ చెప్పాడు సుధాకర్ -

''అందుకనే నిన్న రమేష్‌తో నేనా మాటలంది. మా వెనకాల కూడా ఎవరన్నా గూండాలో, రౌడీలో వుండివుంటే నారాయణని ఎదిరించగలిగే వాళ్లం. 'అతనే దొంగ' అని ధైర్యంగా అనగలిగే వాళ్లం. నష్టపోయే వాళ్లం కాదు. రౌడీల సహాయం సరైనదని కాదు కానీ ...'' అని ఆగిపోయాడు.

ప్రమీలకి ప్రపంచం హఠాత్తుగా చాలా పెద్దదీ, ప్రమాదకరమైనదీ అయినట్టు కనిపించింది. దిగులుగా చూస్తూ మౌనంగా వుండిపోయింది.

కొంచెం సేపాగి అడిగింది —

''మా బాబాయ్ సబిన్స్పెక్టర్‌గా ఈ ఊళ్లోనే వున్నాడు కదా, ఆయన్ని కలవకపోయారా?''

''కలిశాం. కానీ పోలీసులకి, గూండాలికిలా కాకుండా, కొన్ని పరిధులుంటాయిట. వాట్నే దాటి వాళ్లేం చెయ్యలేరన్నారాయన'' నవ్వాడు సుధాకర్ విరక్తిగా.

చిన్నగా నిట్టూర్చి అడిగింది ప్రమీల ''నారాయణ వెనకాలున్న రాజకీయ గూండాలంటే మన వాడితో ఆటలకొచ్చే మోహన్ వాళ్ల నాన్నలాటి వాళ్లేనా?''

''లాటి వాళ్లా ఏమిటి? ఆయనే వాళ్లందర్లోకీ ముఖ్యుడు'' చెప్పాడు సుధాకర్.

'తండ్రికి తగ్గ కొడుకే' అనుకుంది ప్రమీల మోహన్ గుర్తొచ్చి.

***

ఆ సాయంత్రం స్కూల్‌నించీ ఇంటికి తిరిగొచ్చిన వివేక్ అవతారం చూసి విస్తుపోయింది ప్రమీల.

వాడి జుట్టంతా రేగిపోయింది. ఉదయం వేసుకెళ్ళిన తెల్లటి యూనిఫాం మట్టి రంగులోకి మారిపోయింది.

''ఏమైందిరా కన్నా?'' అడిగింది ప్రమీల ఆందోళనగా. సమాధానంగా ఏడవసాగాడు వాడు.

''నేను చెప్తానాంటీ'' అన్నాడు అప్పటిదాకా తలుపు చాటున దాక్కొని నెమ్మదిగా లోపలికొస్తున్న మోహన్. ఆ ఆంటీకి తనంటే ఇష్టం లేదని తెలుసు వాడికి.

వాడి వళ్లంతా కూడా దుమ్ము కొట్టుకుపోయింది.

''వివేక్ క్లాసులో నరేషని వొకడున్నాడాంటీ. వాడు వీడి దగ్గర లంచ్ బాక్స్ లాక్కొని దగ్గర పెట్టుకున్నాడు. ఇవ్వమని వీడెళ్లి గట్టిగా అడిగే సరికి వొక్కతోపు తోశాడు. వీడు నేల మీద పడి లేచి ఏడుస్తూ జరిగిందంతా క్లాస్ లీడర్‌తో చెప్పుకున్నాడు.''

చెప్తున్న మోహన్‌ని మధ్యలో ఆపి అడిగింది ప్రమీల.

''ఏవన్నాడు వీళ్ల క్లాసు లీడరు?''

''వీళ్ల క్లాసు లీడరొట్టి పిరిగ్గొడ్డాంటీ. 'నువ్వింకోటి కొనుక్కోరా. వాడితో మనకెందుకు'అన్నాడట.''

''తర్వాత?'' అడిగింది ప్రమీల.

''తర్వాత నా దగ్గరి కొచ్చాడు ఏడుస్తూ. నేను నరేష్ గాణ్ణి నాలుగు తన్ని వీడి లంచ్ బాక్స్ వీడికి తెచ్చిచ్చాను. ఇంక నరేష్‌గాడేకాదు స్కూల్లో ఎవడూ వీడి జోలికిగానీ, వీడి లంచ్ బాక్స్ దగ్గరికి గానీ రార్లే'' అన్నాడు మోహన్ ఏడుస్తూన్న వివేక్ భుజం మీద అనునయంగా చెయ్యి వేస్తూ.

ప్రమీల క్షణం సేపు ఊరుకుంది.

తర్వాత అన్నది —

''ఇద్దరూ కాళ్లూ, చేతులూ కడుక్కురండి. జంతికలు పెడతాను తిందురుగాని.'' ●

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక న్యూజెర్సీ తెలుగు కళాసమితి

## *1992 కథల పోటీ ఫలితాలు

'తెలుగు కళాసమితి' న్యూజెర్సీ 'ఆంధ్ర జ్యోతి' సచిత్ర వార పత్రిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 1992 సంక్రాంతి కథల పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపికైన కథలు

◆ 2000 రూపాయిల

ప్రథమ బహుమతి పొందిన కథ

### సహాయం

—టి.వి.కాళిదాసు

◆ 1200 రూపాయిల

ద్వితీయ బహుమతి పొందిన కథ

### సెకండ్ ఫ్రంట్

— ప్రతాప్

◆ 600 రూపాయిల

తృతీయ బహుమతి పొందిన కథ

### స్పర్శ

— పులగం శివశంకరరావు

200 రూపాయిల పారితోషికంతో ఎంపికైన ఆరు కథల వివరాలూ, బహుమతి పొందిన కార్టూన్ల వివరాలూ వచ్చే సంచికలో తెలియజేస్తాము.

—ఎడిటర్

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్